జోగుళాంబ.. పాహిమాం

అలంపూర్ ఆలయం

- కోటిలింగాలక్షేత్రం.. అలంపురం
- అంబరాన్నంటేలా శరన్నవరాత్రి ఉత్సవాలు
- నేటి నుంచి దక్షిణకాశిలో వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అలంపూర్, అక్టోబర్14 : కోటి లింగాలు కొలువై దక్షిణ కాశిగా పేరుగాంచిన అలంపురం క్షేత్రం రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠంగా విరాజిల్లుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో (శ్రీశైలం, పిఠాపురం, ద్రాక్షారామం, అలంపురం) నాలుగు శక్తిపీఠాలుండగా విభజన అనంతరం అలంపురం జోగుళాంబ ఏకైక శక్తిపీఠంగా తెలంగాణలో ప్రసిద్ధికెక్కింది. రాజధానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో, గద్వాల జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్లు, కర్నూలుకు 30 కిలోమీటర్ల దూరంలో, తుంగభద్రా నది తీరంలో అలంపూర్ పుణ్యక్షేత్రం వెలిసింది. క్షేత్రాన్ని దర్శించుకునేందుకు రోడ్డు మార్గంతోపాటు రైలుమార్గం కూడా ఉంది. ఈ క్షేత్రంలో జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలతోపాటు నవబ్రహ్మ ఆలయాలు దర్శనమిస్తాయి. కోటి లింగాలు కొలువైన క్షేత్రంలో లేని దేవతామూర్తులూ లేరు. రేణుకాదేవి భక్తులకు సంతానలక్ష్మిగా దర్శనమిస్తుంది. ఇక్కడ కంచి కామాక్షి ఆలయం కూడా ఉన్నది. శతాబ్దాల చరిత్ర గల మ్యూజియంలోని శిల్ప సంపదను తిలకించడానికి విదేశాల నుంచి సైతం యాత్రికులు వస్తుంటారు. దక్షిణ కాశిగా, భాస్కర క్షేత్రంగా, పరశురామ క్షేత్రంగా అలంపురం విరాజిల్లుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కృష్ణ, తుంగభద్రా నదుల సంగమం వద్ద ముంపునకు గురైన సంగమేశ్వర ఆలయాన్ని యథావిధంగా అవే రాళ్లతో (మలచిన ఎర్రరాయి శిల్పాలు) అదే ఆకారం, అదే నమూనాతో ఆలయాన్ని పునః నిర్మించడం చరిత్రలో ఎక్కడా లేదు.

రసాత్మక లింగం - గోస్పాద ముద్రికం

ప్రపంచంలో ఏ క్షేత్రంలో లేనివిధంగా ఇక్కడ ప్రత్యేక ఆకారంలో రసలింగం ఉన్నది. పూర్వం ఈ లింగం నుంచి కొన్ని ప్రత్యేకమైన రసాలు వెలువడుతుండేవి కాబట్టి దానికి రసలింగం అని, బ్రహ్మ తపస్సు చేస్తే పరమేశ్వరుడు ఉద్భవించాడు కాబట్టి బ్రహ్మేశ్వరుడని, ఆకారం చిన్నగా ఉన్నందునా బాలబ్రహ్మేశ్వరుడని పలు పేర్లు వాడుకలో ఉన్నాయి. గోమాత నేలపై పాదం మోపినపుడు ఎలాంటి సమూన ఏర్పడుతుందో ఆ విధంగా (ఆవు గెట్టె పైభాగం ఆకారంలో)పై భాగం లీలీపోయినట్లు ఉంటుంది. శివలింగం నుంచి వెలువడుతున్న విషయాన్ని గమునించిన కొందరు రసిసిద్ధులు పరుశువేది అనే మూలిక సహాయంతో బంగారాన్ని చేసే వారని, అదే బంగారంతో ప్రధాన ఆలయాల చుట్టూ మరో ఎనిమిది ఆలయాలను నిర్మించినట్టు చరిత్ర చెబుతున్నది. అవే నేడు నవబ్రహ్మ ఆలయాలుగా పిలువబడుతున్నాయి.

నవ బ్రహ్మేలయాలు

శైవక్షేత్రాలకు తలమానికంగా శ్రీశైలం క్షేత్రానికి పశ్చిమ ద్వారంలో అలంపూర్, ఉత్తర ద్వారంలో ఉమామహేశ్వరం, తూర్పున త్రిపురాంతకం, పడమరన సిద్ధవటం క్షేత్రాలు వెలిశాయి. సుమారు 1400 సంవత్సరాల కిందట బాదామి చాళుక్యుల కాలంలో రెండో అలంపూరంలో ఆలయాలను నిర్మించినట్లు శిలాశాసనాల ద్వారా తెలుస్తున్నది. క్షేత్రంలో ప్రధాన ఆలయమైన బాల బ్రహ్మతోపాటు కుమార(బ్రహ్మ, ఆర్క బ్రహ్మ, వీర బ్రహ్మ, తారక బ్రహ్మ, విశ్వ బ్రహ్మ, గరుడ బ్రహ్మ, పద్మ బ్రహ్మ, స్వర్గ బ్రహ్మ వంటి నవ బ్రహ్మేలయాలు కూడా నిర్మితమయ్యాయి. ఈ ఆలయాల మీద అల నాటి సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేవిధంగా నాటి అష్టదిక్పాలకులు, శివ, విష్ణు అవతారాలు, నటరాజు, పురాణ గాథలు తెలిపే శిల్ప సంపద, మరెన్నో శిల్పాలు ముగ్ధమనోహరంగా మలచబడ్డాయి. పంచతంత్ర, కావ్య కథా చిత్రాలు, ఆదిత్య హృదయం, రామాయణ, మహాభారత గాథలు తెలియజేసే ఎన్నో శిల్పాలు యాత్రికులకు కనువిందు చేస్తున్నాయి. మరికొన్ని శిల్పాలు మ్యూజియంలో భద్రపర్చారు.

పాపనాశిని ఆలయాలు..

జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలకు దక్షిణ దిశలో కొంతదూరంలో 24 ఆలయాల సముదాయం (పాపనాశిని ఆలయాలు) ఉన్నది. ఈ ఆలయాలు ద్రావిడ సాంప్రదాయానికి చెందినవిగా గుర్తించారు. ఆలయ స్తంభాలపై రామాయణ, మహాభారత, క్షీరసాగర మథనం గాథలు తెలియజేసే అపురూప శిల్పకళా చిత్రాలు ఇక్కడ దర్శనమిస్తాయి. 24 ఆలయాల్లోనూ భిన్నమైన శివలింగాలు, ప్రధాన ఆలయంలో ఆకుపచ్చ రంగులో శివలింగం దర్శనమిస్తుంది.

ఉత్సవాలు ఇలా..

శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ పాలక మండలి సభ్యులు, కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు చర్యలు చేపట్టారు. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

రోజుకో అవతారంలో..

ఆదివారం యాగశాల ప్రవేశం, సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా అమ్మవారు నవరాత్రుల్లో రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


బాలబ్రహ్మేశ్వర ఆలయం

ఆదివారం శైలపుత్రీదేవిగా, 16న బ్రహ్మచారిణీదేవిగా, 17న చంద్రఘంటాదేవిగా, 18న తేది కూష్మాండాదేవిగా, 19న స్కందమాతాదేవిగా, 20న కాత్యాయనీదేవిగా, 21న కాళరాత్రిదేవిగా, 22న మహా గౌరీదేవిగా, 23న సిద్ధిదాత్రీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 20వ తేదీ ఉదయం 10గంటలకు జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వాముల కల్యాణం, సాయంత్రం మాతకు సింహవాహన సేవ, 22న (ఆదివారం) ఉదయం రథోత్సవం, 23న (మహర్నవమి రోజు) కాళరాత్రి పూజ, 24న పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమాలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా తెప్పోత్సవం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే తెప్పోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. 24న (విజయదశమి) ప్రత్యేక పూజల అనంతరం గంగ పూజలో భాగంగా నదిలో ఆదిదంపతుల జల విహారం (తెప్పోత్సవం) ఘనంగా నిర్వహిస్తారు. ఇందుకోసం దేవస్థానం వారు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుద్దీపాల కాంతుల్లో జోగుళాంబ దేవి ఆలయం (ఫైల్)



సభ విజయవంతం చేయాలి

- డాక్టర్ లక్ష్మారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే

ఈనెల 18వ తేదీన జడ్చర్ల పట్టణంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి. తెలంగాణ వచ్చాక జడ్చర్ల రూపురేఖలే మారిపోయాయి. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత జడ్చర్ల నియోజకవర్గం తలసరి ఆదాయంలో పోటీ పడుతున్నది. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఎకరం రూ.కోట్లలో విలువ చేస్తున్నది. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో రీజనల్ రింగ్ రోడ్డు కూడా రానున్నది. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలను పట్టించుకోలేదు. అధికారమిచ్చినా ఎక్కడా అభివృద్ధి చేయలేదు. తెలంగాణ వచ్చాక అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టిస్తున్నారు.

జడ్చర్ల నుంచే శంఖారావం

- 18న జడ్చర్లలో 'ప్రజా ఆశీర్వాద సభ'
- భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్న జీఆర్ఎస్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తొలి ప్రచార సభ
- భారీ జనసమీకరణకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్కెచ్
- లక్షలాదిగా తరలివచ్చేలా పక్కా ప్రణాళిక
- అయోమయంలో ప్రతిపక్షాలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే ముఖ్యమంత్రి పర్యటనలు ఖరారయ్యాయి. ముందుగా ఈనెల 18న జడ్చర్ల నుంచి ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టనున్నారు. జడ్చర్ల పట్టణంలో భారీ ఎత్తున నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గం నుంచి సుమారు లక్ష మంది తరలివచ్చేలా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటికే రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్, నవాబ్‌పేట, ఉర్కొండ, జడ్చర్ల మండలాల కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. సీఎం సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జడ్చర్ల సభ జరిగే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించాలని పార్టీ నాయకులు యోచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తొలి బహిరంగ సభ కావడంతో పార్టీ శ్రేణులు ఈ పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయించడం.. అదివారం బీ ఫారాలు అందించనుండడంతో అన్ని పార్టీల కంటే ముందే కారు దూసుకుపోతున్నది. ఇదే జోష్‌తో సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వేడి మరింత రాజుకున్నది. ఇంకా విపక్షాలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలవుతుండగా.. కారు దూసుకుపోతుండడంతో వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాగా, ఈ నెల 26న నాగర్‌కర్నూల్, అచ్చంపేట.., వచ్చే నెల 6న గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ సభలు నిర్వహించనున్నారు. ఇందుకుకూడా స్థానిక ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేస్తున్నారు.

జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ రోడ్డు సమీపంలో సీఎం కేసీఆర్ సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

పక్కా ప్లాన్‌తో క్లీన్‌స్వీప్ దిశగా..

ఉమ్మడి జిల్లాలో మంచి పట్టు మీద ఉన్న బీఆర్ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో దూసుకుపోతున్నది. 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని రిజియోజకవర్గాలను క్లీన్‌స్వీప్ చేసిన విధంగానే.. 2023 ఎన్నికల్లో కూడా రిపీట్ చేయాలని భావిస్తున్నది. ఈ మేరకు గెలుపు గుర్రాలను ప్రకటించింది. ఎక్కడా అసమ్మతులు, వ్యతిరేకత లేకుండా చేసింది. నాయకుల మధ్య సమన్వయం కుదిర్చింది. తెలంగాణ వచ్చాక ఉమ్మడి జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. ఎమ్మెల్యేలు ఒకరిని మించి ఒకరు నియోజకవర్గాల అభివృద్ధికి కంకణం కట్టుకొని.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఎదురే లేకుండాపోయింది. ప్రతిపక్షాలకు మాత్రం అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడింది. చాలామంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు 'కారు' ఎక్కుతున్నారు. ఈ సారి కూడా గెలుపే లక్ష్యంగా చేసుకొని సీఎం కేసీఆర్ పర్యటన ఖరారు కావడంతో కాంగ్రెస్, బీజేపీలో దడ పుడుతున్నది.

జడ్చర్ల సభపైనే అందరి దృష్టి..

ఎన్నికలకు సరిగ్గా 45 రోజుల సమయం ఉండడంతో.. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈ నెల 18న జడ్చర్ల ప్రజా ఆశీర్వాద సభకు రానున్నారు. దీంతో అందరి దృష్టి ఈ సభపైనే ఉన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మకంగా జడ్చర్లను ఎంపిక చేసుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు అండదండగా ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పార్టీ నిర్ణయానికి కట్టుబడి అప్పట్లో రాజీనామా చేసి ఉద్యమానికి ఊతమిచ్చారు. ఆ తర్వాత తెలంగాణ వచ్చాక మంత్రి వర్గంలో స్థానం లభించింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా సీఎం కేసీఆర్ ఆశీస్సులతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. అనేక పథకాలను ప్రవేశపెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానలో ఏకంగా ఐసీయూ వార్డులు నెలకొల్పారు. అనేక దవాఖానలను మంజూరు చేసి తనకంటూ ఒక ప్రత్యేకత సాధించుకున్నారు. అందుకే సీఎం కేసీఆర్ 2023 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఉద్యమ నేపథ్యం ఉన్న లక్ష్మారెడ్డి నియోజకవర్గాన్నే ఎంపిక చేసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భారీ ఎత్తున జన సమీకరణ చేస్తున్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులతో సమావేశమై ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బైక్ ర్యాలీలు, సంప్రదాయ పద్ధతులతో సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలకాలని సూచించారు. జన సమీకరణ కోసం వాహనాల ఏర్పాటు, ఇతర అంశాలను మండల నాయకులకు అప్పగించారు. ప్రజల్లో ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలను వివరించి సంక్షేమ పథకాలను అందుకున్న ప్రతి ఒక్కరినీ సమావేశానికి తీసుకురావాలని దిశా నిర్దేశం చేశారు. జడ్చర్ల మండలంలోని సమీప గ్రామాల ప్రజలు భారీ ర్యాలీలతో పాదయాత్రగా వస్తామని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతి మండలం నుంచి బైక్ ర్యాలీలు చేపట్టి జడ్చర్ల పట్టణంలో కలుస్తామని మండల నాయకులు ప్రకటించారు. కాగా, సీఎం పర్యటనకు సంబంధించిన సభాస్థలి ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యవేక్షించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పింఛన్ ఆదెరువు.. నెల నెల జీతంలా..

రెండున్నర ఎకరాల పొలం ఉంది. మెట్ట పొలం కావడంతో వర్షం పడితేనే ఏదైనాపంట చేతికొచ్చేది. భర్త ఆనారోగ్యంతో తనువుచాలిచాడు. కొడుకు బతుకు దెరువుకు పట్నం పోయాడు. ఒక్కసారిగా బతుకంత చీకటిగా మారిపోయింది. బతుకు సాగేది ఎలా అనే ప్రశ్న ఆమె ముందు నిలబడింది.ఆ ప్రశ్నకు సమాధానం ముఖ్యమంత్రి కేసీఆర్ రూపంలో వచ్చింది. ఆ సమాధానమే ఇప్పటికీ ఆమెకు అండగా, ఆదెరువుగా ఉంది. ఆమె పేరు తుమ్మేటి అంజనమ్మ.చారకొండ మండలం మర్రిపల్లి గ్రామం.

అంజనమ్మ భర్త పేరు వెంకట్‌రెడ్డి. రెండెకరాల వ్యవసాయ పొలం ఉంది కాని..వర్షం పడితేనే మెట్ట పండే పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో భర్త వెంకట్‌రెడ్డి అనార్యోగ్యంతో 2014లో చనిపోయాడు. ఊరిలో బతుకుదెరువు లేని పరిస్థితి వచ్చింది.ఒక్కగానొక్క కొడుకు బతుకు దెరువుకు పట్నం బాట పట్టాడు. ఒంటరి తనం దీనికి తోడు రోజెలా గడుస్తుందనే ప్రశ్న.అప్పుడే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించడంతోనే అంజనమ్మ కష్టాలకు తెరపడింది. భర్తను కోల్పోయిన అంజనమ్మకు రూ.1016 పించన్ మంజూరైంది.ఎవ్వరిని యాచించకుండా పొట్ట బట్టకు చావులేదనుకుంది.నాలుగు సంవత్సరాల తర్వాత అదే పించన్ రూ.2016కు చేరుకొంది.ఎవ్వరిపై ఆధారపడకుండా ఉన్న వ్యవసాయ పొలంలో చాలనయినంత వ్యవసాయం చేసుకుంటూ గౌరవప్రదంగా ముందుకు సాగుతుంది.పండుగలకు, పబ్బాలకు కొడుకు, కోడలు, పిల్లలు పట్నం నుంచి వస్తే.. వారికి ప్రతి నెల మిగిలిన ఫించన్ డబ్బులతో బట్టలు కొనుగోలు చేసి ఇస్తుంది.బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న ఫించన్ వితంతు మహిళ జీవితంలో వెలుగులు నింపుతుంది. ఇదే విషయమై అంజనమ్మతో మాట్లాడితే.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వేయిన్నోళ్ళ పొగుడుతుంది.తనకు దేవుడిచ్చిన పెద్ద కొడుకు కేసీఆర్ అంటూ ది.కేసీఆర్ ఉన్నంత వరకు తన జీవితానికి ఏలాంటి డోకా లేదంటుంది. నెలనెలా జీతంలా పించన్ టంచన్‌గా వస్తుం ది. ఎవ్వరిపై ఆధారపడాల్సిన అవసరం లేదు.కొడకు.కోడలి ముందు చేయి చాచాల్సిన పరిస్థితి లేదు. ఈ వయస్సులో మాకు అండగా నిలబడ్డ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతోషంగా సుఖంగా ఉండాలని అంజనమ్మ అంటుంది.

- అంజనమ్మ, కల్వకుర్తి

బల్మూరు మండలం చెన్నారంలో జీసీ లోన్‌తో ఇంటిపైకప్పుకు రేకులు వేసిన ఇంటి వద్ద లబ్ధిదారురాలు యాదమ్మ

ఉమ్మడి పాలమూరులో సంక్షేమ సొరభాలు వెల్లివిరుస్తున్నాయి. పేదలకు అండగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఈ పథకాలు పేదలకు కొండంత అండగా నిలిచాయి. నిజమైన అర్హులకే సాయం అందుతుండడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయి. ఏ ప్రభుత్వం ఇలాంటి పథకాలు ఇయ్యలేదని, సీఎం కేసీఆర్ మా పెద్ద కొడుకులా చేయూతనిస్తున్నారని పలువురు దీవిస్తున్నారు.

- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, అక్టోబర్ 14

సంక్షేమ వెలుగులు

- కొండంత అండగా నిలిచిన ప్రభుత్వ పథకాలు
- ఆర్థికంగా ఎదిగిన ఎన్నో కుటుంబాలు
- మాఇంటి పెద్ద కొడుకు కేసీఆర్ అంటూ దీవెనలు

ఒంటరి మహిళలకు అండగా..

సమాజంలో ఒంటరి మహిళల పరిస్థితి ఇబ్బందిగా ఉంది. అటు తల్లిదండ్రులు పట్టించుకోకపోగా ఇటు మెట్టినింటి వారు ఆదరించంగా ఇబ్బందులు పడేవారు. తాము కూలి చేస్తే వచ్చే డబ్బుతో జీవనం కొనసాగించేవాళ్లం. ప్రస్తుతం వయస్సు పైబడడంతో కూలి పనులకు వెళ్లలేం. ప్రభుత్వం అందిస్తున్న ఒంటరి మహిళా పింఛన్ మా లాంటి వారికి ఎంతగానో ఉపయోగ పడుతుంది. ప్రభుత్వం అందించే సాయంతో గోలీబిల్లలు కొనుగోలు చేయడం.. చాయి ఖర్చులు వెల్లదీస్తున్నాను. లేదంటే సొంత ఖర్చుల కోసం కుటుంబంపై ఆధారపడాల్సి వచ్చేది. పింఛన్ వస్తుండడంతో ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులేవు.

- ఏమేలమ్మ, జమ్మిచేడు, జోగులాంబ గద్వాల జిల్లా

కేసీఆర్ సారు.. మా దేవుడు

చేతకాని మాలాంటోళ్లకు తండ్రిలా పింఛన్లు చేసి సీఎం కేసీఆర్ సారు మాకు దేవుడయిండు. మా పెద్దాయన ముప్పై ఏండ్ల కిందట కాలం అయిండు. నాకు నలుగురు కొడుకులు, ఒక బిడ్డ. అందరికీ పెండ్లిళ్లె మనుషుల్లు, మనుషురాళ్లున్నారు. బతుకుదెరువు కోసం ఎవరి తిప్పలు వాళ్లు పట్టణాలకు పోయిండ్రు. కేసీఆర్ సర్కార్ వచ్చినంకా నాకు పింఛన్ వచ్చి పదేండ్లవుతుంది. అంతకు ముందు కూలికి పోతుండే. కిందపడి నడువలేక పోతున్న. పొద్దుపొడిసిన నుంచి పొద్దుగుంకే వరకు మాలాంటి ముసుళ్లోలను కేసీఆర్ సారూ సన్న పిల్లలను సాకినట్లు సాకుతుండ్రు. కండ్లు మసకబారి కనిపించకపోవడంతో వంట చేసుకునేందుకు సత్తువ లాలదు. పింఛన్ పైసలతో నా జీవనం సాగుతున్నది.

- బల్లసుంకులమ్మ, అంబేద్కర్‌కాలనీ, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా

జీసీ లోన్‌తో ఇంటి రేకుల నిర్మాణం

తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ బీసీ కులవృత్తులకు రూ.లక్ష రుణం ఇవ్వడంతో మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన వల్లూరి యాదమ్మ ఇంటి పైకప్పును తీసివేసి కొత్త రేకులు వేసుకున్నది. అనారోగ్యంతో భర్త శేఖరాచారి మూడేండ్ల క్రితం మృతి చెందాడు. ఇటీవల బీసీలోన్‌కు ఆమె దరఖాస్తు చేసుకోవడంతో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేతుల మీదుగా చెక్కు అందుకున్నది. ఆ డబ్బులతో పాత ఇంటి పైకప్పు కోసం రేకులతో నిర్మాణం పూర్తి చేసుకున్నది.

ఇంటోళ్ల పై ఆధారపడకుండా..

జమ్మిచేడు, జోగులాంబ గద్వాల జిల్లా గతంలో నాకు పైసలు అవసరమైతే ఇంటి వారిపై ఆధారపడాల్సి వచ్చేది. ఒక్కోసారి పండుగలకు ఇంటికి మనవడు, మనవరాలు వస్తే వారు అడిగితే ఇవ్వడానికి నా దగ్గర చిల్లిగవ్వ ఉండేది కాదు. ప్రభుత్వం ఆసరా పింఛన్ పెంచడంతో ప్రతి నెలా రూ.2,016 వస్తుండడంతో ఇంటి వారిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండాపోయింది. ఈ పైసలతో నాకు కావాల్సిన మందులు కొనుగోలు చేసుకుంటున్నాను.. ఇంటికొచ్చే ఆడబిడ్డ, వారి పిల్లలకు ఎంతో కొంత ఇస్తున్నా.. ఈ పరిస్థితి కల్పించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు..

- జీసమ్మ, జమ్మిచేడు, గద్వాల జిల్లా